ఎంపీగా గెలిపించండి.. మీలో ఒక్కడిగా ఉంటా

మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి వైష్ణవి ప్రసాద్



కొత్తపేట మోహన్‌నగర్‌లో స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్‌కు మద్దతు తెలియజేస్తున్న శ్రీబాలాజీనగర్ కాలనీ వాసులు

నాగోలు: తనకు ఎలాంటి హై కమాండ్ నాయకులు లేరని ప్రజలే తనకు హైకమాండ్ అని, తనను మల్కాజిగిరి ఎంపీగా గెలిపిస్తే మీలో ఒక్కడిగా ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. సోమవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని శ్రీబాలాజీ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైష్ణవీ ప్రసాద్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక కాలనీ వాసుల సహకారంతో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే స్థాయికి ఎదిగానని తెలిపారు. మన పరిధిలో ప్రజా ప్రతినిధులు గెలిచిన నాయకుల వద్దకు వెళితే సమస్యలు చెప్పుకునే సమయం కూడా ఇవ్వడం లేదని అన్నారు. మీకు నిత్యం అందుబాటులో ఉండే.. మీదగ్గర ఉండే తనను ఎంపీ గెలిపిస్తే నిరంతరం మీలో ఒక్కడిగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సంకల్పంతో మాల్కాజిగిరిని అభివృద్ధి పథంలో ముందు ఉంచే అందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపరచిన తన ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీ వాసులు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ బాలాజీ కాలనీ వాసులు గోపాల కిషన్‌రావు, కుమార స్వామి, అరవింద్, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్‌రావు వివిధ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

9 నుంచి అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరప్రతాలను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయం 28వ బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి 15 వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు అష్టలక్ష్మి దేవాలయ చైర్మన్ సోమ సురేష్ అన్నారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాల కన్నుల పండుగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలలో భాగంగా తిరుచి పల్లకి సేవ, శేష వాహన సేవ, హంస వాహన సేవ, సూర్యప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, గజవాహనసేవ, హనుమత్ వాహన సేవ, గరుడ వాహన సేవ, అశ్వ వాహనసేవ, సింహ వాహనసేవ, కల్ప వృక్ష వాహన సేవ, చిన్న రథోత్సవం, పెద్ద రథోత్సవం కార్యక్రమాలు భారీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఎల్‌బీనగర్ అధ్యక్షుడు, లింగోజిగూడ డివిజన్ మాజీ వార్డు కమిటీ సభ్యుడు పోలగోని సాయియాదవ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ నేతృత్వంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్‌బీనగర్‌లోని పార్టీ ఎన్నికల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాగేశ్వర్, శ్రీను, మల్లేష్, మురళీ, అవినాష్, శశిధర్, ఆంజనేయులు, రవి, శ్రీకాంత్, అనిల్, మమత, ఉమా, జాహంగీర్, నజీయా, సమీరా, రాధియా, సంజీవ, సుజాత, వెంకట్, లక్ష్మి, కిరణ్, సంతోష్, సందీప్‌లున్నారు.

ఘనంగా త్యాగరాజు స్వామి జయంతి ఉత్సవాలు



సంగీత విభావరి నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: భారతీయ కళాసమితి ఆధ్వర్యంలో ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురి కాలనీలో సద్గురు శ్రీ త్యాగరాజు స్వామి 257వ జయంతి ఉత్సవాలు, 23 వ వాగ్గేయ కార సంగీత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం నిర్వహించిన సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలిండియా రేడియో డైరెక్టర్ ఉదయశంకర్, రైల్వే పూర్వ జనరల్ మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సమితి అధ్యక్షులు నర్సింహారావు, ఉపాధ్యక్షుడు నారాయణ, సెక్రటరీ కృష్ణ తాండవ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమంలో అదితి ప్రహ్లాద్ పాటలు ఆహుతులను మంత్ర ముగ్ధులను చేశాయి.

నాగోలు పరిధిలో ఫ్లాగ్‌మార్చ్



చైతన్యపురి పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నాగోలు/చైతన్యపురి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నాగోలు డివిజన్ పరిధిలోని నాగోలు, మమత నగర్, సాయినగర్ కాలనీ, లలితనగర్, శుభం కాన్వెన్షన్, జైపురికాలనీ, సర్వేనెంబర్ 58, ఫతుల్లాగూడ, బండ్లగూడ, ఆనంద్‌నగర్ చౌరస్తా, జీఎస్‌ఐ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు

- చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తపేట, చైతన్యపురి, ఇందిరానగర్, బాబు కంప్లెక్స్, ప్రభావత్‌నగర్, సాయినగర్ పరిసర ప్రాంతాలల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వమించారు.



చలివేంద్రం ప్రారంభం

మన్సూరాబాద్: డివిజన్ పరిధి జడ్జెస్ కాలనీలోని శ్రీసాయిబాలాజీ మెడికల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వాసవీ క్లబ్ మన్సూరాబాద్ అధ్యక్షుడు మొరిశెట్టి సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వహకుడు సతీష్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్, గాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షమయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘గ్యారంటీ’లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

ఎంపీ జ్యోతిమణి సెన్నిమలై



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ జ్యోతిమణి సెన్నిమలై

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఐదు న్యాయ గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎంపీ జ్యోతిమణి సెన్నిమలై సూచించారు. నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, డివిజన్ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కితో కలిసి సోమవారం ఎల్‌బీనగర్‌లోని పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రధానిని చేయాలంటే కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఐదుగురు మహిళలు, ఐదుగురు యువకులతో కమిటీ వేయాలని తెలిపారు. మధుయాష్కి మాట్లాడుతూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిడం ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నదన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మంచి మెజార్టీ అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, లక్ష్మిప్రసన్నగౌడ్, భీమిడి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 45, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 18, క్యారెట్ 35. దొండ 28, ఆలు 28, ఉల్లి 26, గోకర 28, దోస 15, సొర 09, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 50, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 55, బీట్‌రూట్ 18, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 40. ఈధరలు మంగళవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సమస్యల పరిష్కారానికి ఏకతాటిపై నడవాలి

మలక్‌పేట: సమస్యల పరిష్కారానికి క్రైస్తవులంతా ఏకతాటిపై నడవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైద్రాబాద్‌లోని చంద్రాయణగుట్ట, మలక్‌పేట, గోషామహల్, చార్మినార్, కార్వాన్, యాకత్‌పుర, బహదూర్‌పుర నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులతో ఆదివారం రాత్రి మలక్‌పేటలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. క్రైస్తవులకు శ్మశాన వాటిక కోసం ప్రభుత్వ స్థలం కేటాయించే విధంగా కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారుల కన్ను

మలక్‌పేట: ప్రభుత్వ స్థలాలపై కన్నేసిన భూకబ్జాదారులు కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండటాన్ని అదనుగా తీసుకున్న కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలకు ఎసరు పెడుతున్నారు. సైదాబాద్ మండల పరిధి మూసారంబాగ్‌లో కబ్జాల పరంపర కొనసాగుతోంది. శాలివాహననగర్ అంబేద్కర్‌నగర్‌లో దాదాపు 400 గజాల ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు గతంలో బోర్డు పెట్టారు. ఆ స్థలంపై కన్నేసిన కబ్జాదారులు బోర్డు తొలగించారు. అంతటితో ఆగకుండా కబ్జాదారులు సోమవారం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. గుడిసెవాసులు స్థానిక నాయకుడు బొక్క మధుసూదన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో బీజేపీ నాయకులు పనులు అడ్డుకుని సైదాబాద్ తహశీల్దార్ జయశ్రీకి ఫిర్యాదు చేశారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ ఆఫీసర్ శేఖర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరతామని తెలిపారు.

గుంటి జంగయ్య నగర్‌లో డ్రైనేజీ జాం

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ కాలనీలో తరచు డ్రైనేజిలు జాం అవుతుండడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్లాట్ నెం. 118 నుంచి 136 ఇళ్ల మధ్య డ్రైనేజి పైప్‌లైన్ జాం అయి మ్యాన్‌హోల్‌ల నుంచి మురుగునీరు రోడ్డుపైకి వస్తుండడంతో దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా వారు సరైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానిక నివాసి ముఖపల్లి సిద్దేశ్వర్ ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి నిందితుడికి ఇరవై ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష తోపాటు రూ. 10వేల జరిమానాను రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి విధించారు. కోర్టు ఏపీపీ సునీత తెలిపిన మేరకు.. మీర్‌పేట్ ఠాణా పరిధిలో ఓ మైనర్ బాలికను (14) గుర్తు తెలియని వ్యక్తులు అపహరించి లైంగిక దాడి చేశారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బాలిక వాంగ్మూలం నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టుచేశారు. కేసు విచారణలో ఉండగా ప్రధాన నిందితుడు చనిపోగా నేరానికి సహకరించిన నిందితుడు యెమంపల్లి కృష్ణ(25) పై విచారణ చేపట్టిన కోర్టు సోమవారం శిక్ష విధించింది. భాధితురాలికి 2లక్షల రూపాయలు నష్టపరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి సిఫార్సు చేశారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి



సరూర్‌నగర్ వీఎంహోంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: గ్రేటర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది తామేనని ఎంపీగా రాగడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం సరూర్‌నగరలోని విక్టోరియా మెమోరియల్ గ్రౌండ్స్‌లో వాకర్స్‌తో ముచ్చటించి తమ పార్టీకి మద్దతు పలకాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తీర్చానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి జరగదని, ఎల్‌బీనగర్‌లో మరింత అభివృద్ధి జరుగాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు వాకర్స్, నాయకులు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్తుకు మోదీ గ్యారంటీ



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: దేశ భావితరాల భవిష్యత్తుకు ప్రధాని నరేంద్రమోదీ గ్యారంటీ అని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని జడ్జెస్‌కాలనీ, సహారా స్టేట్స్‌కాలనీ, శ్రీరామా హిల్స్‌కాలనీలో కార్పొరేటర్ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ఈటల ష్యూరిటీయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను బీఆర్‌ఎస్ మోసం చేసింది



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

లింగోజిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా ఆర్యవైశ్యులను మోసం చేసిందని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆరోపించారు. ఆర్య వైశ్య మహా సభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం కర్మన్‌ఘాట్‌లో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి మాటనిలబెట్టుకున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ముద్దగోని రాంమోహన్ గౌడ్ రులు పాల్గొన్నారు.

‘రాగిడి’కి మద్దతుగా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తు బీఆర్‌ఎస్ నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పటి చిరంజీవి తదితరులు

నాగోలు: మల్కాజిరిగి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నాగోలు డివిజన్ అధ్యక్షులు తూర్పటి చిరంజీవి కోరారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగోలు డివిజన్ పరిధిలోని డిఎస్ఎస్‌నగర్, సర్వేనెంబర్ 58, ఫత్తుల్లగూడ, అజయ్‌నగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ ఎన్నికల్లో బీజేపీదే విజయం



స్వామి సారంగ్ మహరాజ్ మోహిలే ఆశీర్వాదం పొందుతున్న మాధవీలత

చార్మినార్: ఎంపీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని స్వామి సారంగ్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వామి సారంగ్ మహరాజ్ మోహిలే అన్నారని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. సోమవారం తనతో పాటు స్వామిజీ హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతను కలిసి ఆశీర్వదించారు. మాధవీలత ఆయనకు ఫల, పుష్పాలు అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో బీజేపీకి విజయావకాశాలు దగ్గరగా ఉన్నాయన్నారు. గెలుపు ఓటములు దైవాధీనం అని..తమ ప్రయత్నాలను చివరి నిమిషం వరకు విరమించుకోవద్దని ఆయన మాధవీలతకు సలహా ఇచ్చినట్లు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.

గల్లంతైన వారి మృతదేహాలు లభ్యం

పహాడీషరీఫ్: చేపలు పట్టేందుకు వెళ్లి జల్‌పల్లి చెరువులో గల్లంతైన ఇద్దరు బాలుర మృతదేహాలను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సోమవారం వెలికితీశాయి. పహాడీషరీఫ్ పోలీసులు తెలిపిన మేరకు.. పాతబస్తీ బార్కాస్‌కు చెందిన అబ్దుల్ వాహెద్(14), ఉస్మాన్ నహదీ(16), హఫీజ్, వసీం, అబుబకర్ నహదీలు ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో వాహెద్, ఉస్మాన్ నహదీలు గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటినుంచి గాలించినప్పటికీ లభ్యం కాకపోవడంతో, సోమవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలించగా ఈ ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న అనంతుల సురేందర్‌రెడ్డి తదితరులు

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంతుల సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తపేట డివిజన్ పరిధిలోని న్యూ నాగోల్ కాలనీ, సమతాపురి కాలనీలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వమించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, కొమ్ము బాబు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు మన్సూరాబాద్‌లోని కాస్మోపాలిటన్ కాలనీ, ఓల్డ్ విలేజీలలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, ఎలుకొండ రాంకోటి, సిద్దగోని జగదీష్‌గౌడ్, నాంపల్లి బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలి



సీఎంను కలిసిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బనగిరి నాగరాజు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బనగిరి నాగరాజు, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నాగరాజు ఆధ్వర్యంలో పలువురు చెందిన నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

స్ట్రాంగ్ రూంలనుపరిశీలించిన అబ్జర్వర్



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్‌రూంలను పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ ప్రియాంక శుక్లా

ఎల్‌బీనగర్: ఈ నెల 13న జరుగనున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సరూర్‌నగర్‌లో ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను జనరల్ అబ్జర్వర్ ప్రియాంక శుక్ల సోమవారం పరిశీలించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన మాక్ పోలింగ్, ఈ వీఎంలు కమిషనింగ్, సింబల్ లోడింగ్ పోస్టల్ బ్యాలెట్, స్ట్రాంగ్ రూంలను సందర్శించి ఎన్నికల అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌బీనగర్ అసెంబ్లీ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కూడ ఆమె సందర్శించారు. తీసుకోవాల్సి బందోబస్తు, ఇతర వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ పంకజ, నోడల్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని బహదూర్‌పురా శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు బస్తీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఆరు గ్యారంటీల అమలు కరపత్రాలను ఓటర్లకు అందజేసి కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాతబస్తీలో ఏళ్ల తరబడి అధికారం చెలాయిస్తున్న మజ్లిస్ పార్టీ ఎక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అందుకే హైదరాబాద్ ఓటర్లు ఈసారి తమ పార్టీకే ఓటు వేసి తమ ఎంపీ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్‌ను తెలిపించనున్నారన్నారు.

ప్రధాన పార్టీలకు దీటుగా ఎన్నికల ప్రచారం

చార్మినార్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులకు దీటుగా తమ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ అధికార ప్రతినిధి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ అన్నారు. సోమవారం పాతబస్తీ మొఘల్‌పురాలోని పార్టీ ప్రధాన కార్యలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గం నుంచి తాను నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో సోమవారం తాను నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి స్థానికుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. సెక్యులర్ పార్టీ అయిన తమ పార్టీ వైపు ఇరువర్గాల ఓటర్లు ఆకర్షితులవుతున్నారన్నారు.